ఆకట్టుకునేలా అంగన్‌వాడీ కేంద్రాలు

- ఆటపాటలతో కూడిన విద్య అందించడమే లక్ష్యం
- చండూరు, గట్టుప్పల్ మండలాల్లో ఒక్కో కేంద్రం గుర్తింపు
- రంగులు, బొమ్మలు వేయడం పూర్తి
- చిన్నారులకు మరిన్ని సౌకర్యాలు కల్పించనున్న ప్రభుత్వం




గట్టుప్పల్ మండలంలోని వెల్మకన్నె గ్రామంలో మోడల్ అంగన్‌వాడీ సెంటర్

చండూరు: పల్లెల్లో అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు ఐసీడీఎస్ అధికారులు ఓ అడుగు ముందుకు వేశారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల వైపు ఆకర్షించేవిధంగా అధికార యంత్రాంగం కృషి చేస్తోంది. మండలానికి ఒక కేంద్రాన్ని మోడల్ అంగన్‌వాడీ సెంటర్‌గా తీర్చిదిద్దుతోంది. మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలుగా గుర్తించినవాటికి రంగులు.. గోడలపై వివిధ రకాల బొమ్మలను గీయిస్తున్నారు. చిన్నారులను ఆకర్షించేలా వివిధ రకాల చిత్రాలను గీస్తున్నారు. ప్రస్తుతం కేంద్రాల్లో చిన్నారులకు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తూ.. చిన్నారులకు ఆట బొమ్మలతో అక్షరాలు నేర్పిస్తున్నారు. దీంతో అనుకున్నంత స్థాయిలో కేంద్రాల్లో ఫలితాలు రావడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల హాజరు శాతం తగ్గుతూ వస్తుండడంతో ఇక మార్పులకు అధికారులు శ్రీకారం చుట్టారు. గోడలపై రంగులు వేసి వివిధ రకాల ఆట బొమ్మలు గోడలపై గీయడంతో చిన్నారుల చూపు కేంద్రాల వైపు మరలుతుందని అధికారులు భావిస్తున్నారు.

వెల్మకన్నె, పుల్లెంల గ్రామాల్లో..

ప్రభుత్వ భవనాల్లో నిర్వహించే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎక్కువ చిన్నారుల సంఖ్య ఉన్న కేంద్రాలను అధికారులు మోడల్ కేంద్రాలుగా గుర్తించారు. గట్టుప్పల్ మండలం వెల్మకన్నె, చండూరు మండలం పుల్లెంల గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను మోడల్ సెంటర్లుగా అధికారులు గుర్తించారు. ఇప్పటికే ఆయా కేంద్రాలకు రంగులు వేయడం పూర్తిచేశారు. ఇక ఆయా కేంద్రాలకు సౌకర్యాలు ఏర్పాటు చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

అన్ని సౌకర్యాలతో..

మోడల్ అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తారు. సెంటర్‌కు రంగులు వేసి గోడలపై ఆకర్షించే బొమ్మలు వేయడం, సెంటర్లో చిన్నారులకు మరుగుదొడ్లు, కూర్చునేందుకు కుర్చీలు, టేబుల్స్ ఏర్పాటు చేయనున్నారు. ఆడుకునేందుకు అన్ని రకాల ఆటవస్తులు సమకూర్చనున్నారు. చిన్నారులకు డ్రెస్ ఉచితంగా ఇవ్వనున్నారు. చిన్నారులు క్రమం తప్పకుండా కేంద్రాలకు వచ్చి అక్షరాలతో పాటు ఆటలు నేర్చుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేయనున్నారు.

రంగులు వేయడం పూర్తయింది

మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలకు రంగులు, బొమ్మలు వేయడం పూర్తయింది. త్వరలో చిన్నారులకు డ్రెస్‌లు అందజేస్తాం. అదేవిధంగా మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలకు కుర్చీలు, టేబుల్స్, ఆట వస్తులు అందజేస్తాం.
–వెంకటమ్మ, ఏసీడీపీఓ

దివ్యాంగులకు క్రీడా పోటీలు


జెండా ఊపి పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ: సువాస్ సెల్వాయి జీవితం దివ్యాంగులకు ఆదర్శమని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో గురువారం దివ్యాంగుల పరుగు పందెం పోటీలను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సెల్వాయి టోక్యోలో జరిగిన పారా ఒలంపిక్స్‌లో రెండుమార్లు మెడల్ సాధించి దేశానికి వన్నె తెచ్చారన్నారు. జిల్లాస్థాయిలో జూనియర్, సీనియర్ క్యారమ్స్, చెస్, షాట్‌పుట్, వీల్‌చైర్, పరుగు పందెం పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులను ఈ నెల 25 నుంచి జరిగే రాష్ట్రస్థాయిలో దివ్యాంగుల ఆటల పోటీలకు పంపుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె.కృష్ణవేణి, యువజన క్రీడల అధికారి విష్ణుమూర్తి, విమల, నిర్మల, లావణ్యకుమారి, హరిత, సునీత, నాగమణి, గణేశ్, వెంకట్‌రెడ్డి నాగిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవాల సభ ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్

స్థానిక ఎన్జీ కాలేజీ మైదానంలో ప్రజపాలన విజయోత్సవాల సభ ఏర్పాట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం పరిశీలించారు. శుక్రవారం సాయంత్రం జరిగే కార్యక్రమంలో రాష్ట్ర సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పుంజల ఆధ్వర్యంలో కళాకారుల బృందం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

నేడు సదర్ సమ్మేళనం

మునుగోడు: గొల్ల, కుర్మ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మునుగోడు మండల కేంద్రంలో సదర్ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ కన్వీనర్ బూడిద లింగయ్యయాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకు నిర్వహించే ఉత్సవానికి స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితోపాటు యాదవ, కుర్మ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. మండలంలోని కుర్మ,గొల్లలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి


నకిరేకల్ : జెండా ఆవిష్కరిస్తున్న వెంకటనారాయణ

నకిరేకల్ : మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ కనుకు వెంకటనారాయణ అన్నారు. నకిరేకల్ మండలం నోముల గ్రామంలో గురువారం మత్స్యకారుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని సంఘం జెండాను ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ మత్స్యకారులంతా ఐక్యతతో సొసైటీ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నక్క రాంబాబేష్, దేశగాని వేణుకుమార్, బండారి బాలకృష్ణ, చెవ్వ నాగరాజు, పెద్ద వెంకన్న, దాసరి తిరుపతమ్మ, ఆదిలక్ష్మమ్మ పాల్గొన్నారు.

కట్టంగూర్ : మత్స్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని తెలంగాణ మత్స్యశాఖ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మురారి మోహన్ డిమాండ్ చేశారు. గురువారం కట్టంగూర్ మండలంలోని ఈదులూరు గ్రామంలో జరిగిన ఆ సంఘం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మత్స్య సొసైటీ జిల్లా డైరెక్టర్ తవిడబోయిన అజయ్‌కుమార్, గుడిసె రమేష్, తవిటి నాగార్జున, నార్ల యాదయ్య, నార్ల సత్యనారాయణ, తిరుమలేష్, శివకృష్ణ, నాగేష్, రామకృష్ణ, వీరభద్రం పాల్గొన్నారు.

మర్రిగూడ : ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని మర్రిగూడ మండలంలోని ఖుదాబాక్షపల్లిలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యకార సొసైటీ సంఘం గ్రామశాఖ అధ్యక్షుడు యాట గిరి ముదిరాజ్ సంఘం జెండాను ఆవిష్కరించారు. గిరి, రవి, వెంకటేష్, గణేశ్, రాఘవేందర్, వెంకటేష్, అశోక్, శ్రీను, రాజు, మహేందర్, పెద్దయ్య, రమేష్, యాదయ్య, రాజు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా డాటా ఎంట్రీ చేయండి


మునుగోడు: సిబ్బందికి సూచనలు ఇస్తున్న చండూరు ఆర్డీఓ శ్రీదేవి

మునుగోడు: సమగ్ర కుటుంబ సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో ఎలాంటి తప్పులు ఉండవద్దని చండూరు ఆర్డీఓ శ్రీదేవి సిబ్బందికి సూచించారు. గురువారం మునుగోడులోని రైతు వేదికలో డాటా ఎంట్రీ సిబ్బందికి నిర్వహించిన ఒక రోజు శిక్షణ శిబిరానికి ఆమె హాజరై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ డాటా ఎంట్రీచేసే సమయంలో ఏదైనా సందేహం ఉన్నా.. ఎన్యుమనేటర్లు రాసిన పదాలు అర్థం కాకపోయినా సర్వే చేసిన సిబ్బందిని పిలిపించుకుని ఆ కుటుంబం వివరాలను ఎంట్రీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.నరేందర్, ఎంపీడీఓ విజయభాస్కర్, ఎంఈఓ రవి తదితరులు పాల్గొన్నారు.

సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

కట్టంగూర్ : సమగ్ర కుటుంబ సర్వే వివరాలను డాటా ఎంట్రీ ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో తప్పుల్లేకుండా నమోదు చేయాలని నల్లగొండ ఆర్డీఓ వై.అశోక్‌రెడ్డి ఆదేశించారు. గురువారం కట్టంగూర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో డాటా ఎంట్రీ ఆపరేటర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎంపీడీఓ జ్ఞాన ప్రకాశ్‌రావు, ఎంఈఓ అంబటి అంజయ్య, ఎంపీఓ చింతమల్ల చలపతి, ఎంపీఎస్ఓ శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్ సట్టు గోపి ఉన్నారు.

ముగిసిన కులగణన సర్వే

తిప్పర్తి : కులగణన ఇంటింటి సర్వే తిప్పర్తి మండలంలో పూర్తయిందని ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి గురువారం తెలిపారు. మండలంలో మొత్తం 26 గ్రామ పంచాయతీల్లో 10,920 కుటుంబాలకు గాను 10,920 కుటుంబాల సర్వే పూర్తి చేశారని పేర్కొన్నారు. సర్వేలో 77మంది ఎన్యుమరేటర్‌లు, 12మంది సూపర్ వైజర్‌లు పాల్గొన్నారని తెలిపారు.

పాఠశాలల్లో విద్యార్థులకు చెకుముకి పోటీలు


నల్లగొండ టౌన్: చెకుముకి పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు


నకిరేకల్ : విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ నాగయ్య


చిట్యాల: ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎంఈఓ సైదానాయక్


కట్టంగూర్: బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఎంఈఓ అంబటి అంజయ్య


శాలిగౌరారం: జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులు

నల్లగొండ టౌన్: విద్యార్థులు సైన్స్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి నన్నూరి వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం నల్లగొండలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్టు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి, కే.రాఫెల్, జంజరాల సైదులు, గౌతమి, రవీందర్, ధనుంజయ్ పాల్గొన్నారు.

నకిరేకల్ : పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నకిరేకల్ ఎంఈఓ ఎం.నాగయ్య బహుమతులు అందజేశారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు కనుకుంట్ల విద్యాసాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బెల్లి యాదయ్య, వేదిక గౌరవ అధ్యక్షుడు డాక్టర్ చేతరాజు రవికిరణ్, జేవీవీ జిల్లా కార్యదర్శి జి.భద్రయ్య, ప్రతినిధులు నగేష్, కోకిల, చల్లోజు శ్రీనివాస్, విజయలక్ష్మీ, పాల్గొన్నారు.

చిట్యాల: విద్యార్థుల్లో శాస్త్రీయత దృక్పథం పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని చిట్యాల ఎంఈఓ సైదానాయక్ అన్నారు. చిట్యాలలో గురువారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబరాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు ఎంఈఓ బహుమతులు అందజేశారు. జన విజ్ఞాన వేదిక చిట్యాల మండల కన్వీనర్ దాసరి శ్రీరాములు, జిల్లా మాజీ కార్యవర్గ సభ్యుడు కుకుడాల గోవర్ధన్, హెచ్ఎం గోగికార్ మాధవి, గుత్తా రామ్మోహన్, పెద్ది నరేందర్, గట్టు అలెగ్జాండర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కట్టంగూర్: విద్యార్థులు సైన్స్ పట్ల అవగాహన పెంపొందించుకోవాలని ఎంఈఓ అంబటి అంజయ్య అన్నారు. చెకుముఖి సైన్స్ సంబరాల్లో భాగంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలంలోని హైస్కూల్స్ విద్యార్థులకు చెకుముఖి పరీక్ష నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎంఈఓ బహుమతులు అందజేసిన అనంతరం మాట్లాడారు. జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు బెల్లి ఆంజనేయులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు మాధవి, లక్ష్మి, సుజాత, సైదమ్మ పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి చెకుముకి టాలెంట్ పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ కుకుట్ల నర్సింహ, నర్రా రవీందర్, హెచ్ఎం రాములు తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లిలో..

కేతేపల్లి: విద్యార్థులు మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని కేతేపల్లి ఎంఈఓఎ.రాజేంద్రప్రసాద్ కోరారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు నిర్వహించిన మండల స్థాయిలో చెకిముకి టెస్ట్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మాధవ్ని స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాలిగౌరారం మండలంలో..

శాలిగౌరారం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు సైన్స్ అంశాలపై టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులకు జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి అల్లం శంకర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శాలిగౌరారం జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు కోట మల్లయ్య, కడేరు రవికుమార్, విజయనిర్మల పాల్గొన్నారు.

మర్రిగూడ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి చెకుముకి పరీక్షను ఎంఈఓ బిట్టు శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు మెమొంటోలు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు కళా శ్రీనివాస్, పున్నా కృష్ణయ్య, కె.సంజీవరావు, గిరి యాదయ్య, శ్రీనయ్య, రజీయొద్దీన్, మాస బాలరాజు, రమణ, కృష్ణారెడ్డి, హుస్సేన్, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం బహిరంగ సభను జయప్రదం చేయాలి

నార్కట్‌పల్లి : మిర్యాలగూడలో డిసెంబర్ 2 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించే సీపీఎం బహిరంగ సభలను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నార్కట్‌పల్లిలో జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా కమిటీ సభ్యుడు ఎస్ఆర్ వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి చింతపల్లి బయ్యన్న, చెరుకు పెద్దులు, కల్లూరి యాదగిరి, కుమ్మరి శంకర్, కొప్పు శ్రావణ్, ఐలయ్య, రవి, రామచంద్రం పాల్గొన్నారు.

చిట్యాల: మిర్యాలగూడలో నిర్వహించనున్న సీపీఎం 21వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి కోరారు. చిట్యాలలో గురువారం జరిగిన ఆ పార్టీ మండల సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్రూరి శ్రీను అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, జిట్ట సరోజ, మండల సహాయ కార్యదర్శి లింగస్వామి, సుధాకర్‌రెడ్డి, నర్సింహ, కుమారస్వామి, నరేష్, లక్ష్మీనారాయణ, యాదయ్య, రాములు, గణేశ్, రాములు పాల్గొన్నారు.

చండూరు(గట్టుప్పల్) : మిర్యాలగూడలో జరగనున్న సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బండ శ్రీశైలం కోరారు. మహాసభలకు సంబంధించిన కరపత్రాలను గురువారం వెల్మకన్నె గ్రామంలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. గోపాల్‌రెడ్డి, సుధాకర్, కృష్ణ, వెంకటేశం, అబ్బయ్య, సత్తయ్య, చిక్కుల సైదులు, భిక్షం, వెంకటేశం, నరసింహ, లక్ష్మయ్య, కొండ కృష్ణయ్య, గోపాల్ పాల్గొన్నారు.

దిమ్మెను కూల్చడం సరికాదు

నకిరేకల్ : హాలియాలో మొల్లమాంబ విగ్రహం కోసం నిర్మించిన దిమ్మెను కూల్చడం సరికాదని కుమ్మర సంఘం జిల్లా నాయకుడు దొమ్మాటి సైదులు అన్నారు. నకిరేకల్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

మునుగోడు: అనారోగ్యానికి గురై ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందిన మునుగోడు పట్టణానికి చెందిన ఏరుకొండ నిర్మల స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో ఇటీవల సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకుంది. కాగా ఆమెకు మంజూరైన రూ.20 వేల విలువ గల చెక్కును కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, పాల్వాయి జితేందర్‌రెడ్డి, సాగర్ల లింగస్వామి, ఎండీ.అన్వర్, పందుల నర్సింహ, దుబ్బ రవి, జిట్టగోని సైదులు, సంగిశెట్టి పరమేష, సింగం గిరి, పందుల లక్ష్మణ్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కేతేపల్లి: నార్కట్‌పల్లిలో ఈ నెల 24న నిర్వహించనున్న టీఎస్ యూటీఎఫ్ 6వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ముద్రించిన వాల్ పోస్టర్‌లను గురువారం మండలంలోని చెర్కుపల్లి జెడ్పీ పాఠశాలలో ఆసంఘం నాయకులు ఆవిష్కరించారు. టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బచ్చుపల్లి మధు, పి.జయసాగర్, హెచ్ఎం డి.రాజబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్యదర్శికి వినతి

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని మసీదు వెనుక భాగంలో మాండ్ర గ్రామానికి వెళ్లే దారి వెంబడి నిర్మించే డ్రెయినేజీ పనులు నిలిపివేయాలని కోరుతూ గురువారం నార్కట్‌పల్లి పరిరక్షణ సమితి సభ్యులు పంచాయతీ కార్యదర్శికి సుభానుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో ఉన్న డ్రెయినేజీ స్థానంలో కాకుండా ఆరు ఫీట్లు జరిపి నిర్మించడంతో రోడ్డు ఇరుకుగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడబోయిన శ్రీనివాస్, నోముల నాగరాజు, కన్నెబోయిన నర్సింహ, శ్రావణ్, గణేశ్, రమేష్, రామలింగం పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు


మాతా పారాయణం చేస్తున్న మహిళలు

నకిరేకల్ : పట్టణంలో వైశ్య భవనం వెనుక సుమారు రూ.కోటిపైనే వ్యయంతో నిర్మించిన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఐదు రోజులపాటు నిర్వహించిన అమ్మవారి విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలు గురువారం రాత్రి ముగిశాయి. ముగింపు వేడుకల్లో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు తేలుకుంట్ల చంద్రశేఖర్ పాల్గొని పూజలు చేశారు. ఈసందర్భంగా ఆయన ఆలయానికి అర కిలో వెండి వస్తువులు బహూకరించారు. ఆర్యవైశ్య మహిళలు మాతా పారాయణం చేశారు. చండూరు వాసవీ మాత ఆలయ చైర్మన్ తేలుకుంట్ల జానయ్య, పోలా శ్రీనివాస్, రాజకుమారి, వనమా వెంకటేశ్వర్లు, నకిరేకల్ పట్టణ, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వీర్లపాటి నర్సింహారావు, బ్రహ్మదేవర రాంమోహన్‌రావు, శ్రీకనకదుర్గ ఆలయ చైర్మన్ బ్రహ్మదేవర పద్మాకృష్ణమూర్తి, ప్రతినిధులు గర్రె వెంకన్న, మురళి, బ్రహ్మదేవర రమేష్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన టాస్క్‌ఫోర్స్ అధికారులు


రికార్డులు పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

చిట్యాల: వెలిమినేడు పీహెచ్‌సీలో నిల్వ ఉన్న మెడిసిన్స్‌ను గురువారం రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీ చేశారు. ఆస్పత్రిలో మెడిసిన్ రికార్డులను పరిశీలించి, ఆన్‌లైన్‌లో నమోదయిన వివరాలతో సరిచూశారు. ఆస్పత్రిలోని ఫ్రీజర్‌లో నిల్వ చేసిన మెడిసిన్స్‌ను కూడా పరిశీలించారు. వైద్య సిబ్బంది పనితీరును పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఉబ్బు నర్సింహను వారు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు, స్టేట్ మెడిసిన్ అండ్ హెల్త్ టీబీ డిపార్ట్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఏ.రాజేషం, జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్.పి.శ్రీనివాస్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ స్వాతి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పి.సంపత్‌కుమార్, హెఈఓ జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన


ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తున్న డీఎస్ఓ

నల్లగొండ రూరల్ : ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని డీఎస్ఓ వెంకటేశ్వర్లు సిబ్బందికి సూచించారు. గురువారం ఆర్జాలబావి, దండంపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మ్యాచర్ వచ్చిన వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. ఇప్పటి వరకు జిల్లాలో 140 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు.

23న ఆత్మీయ సమ్మేళనం

నల్లగొండ: జిల్లా కేంద్రంలో ఈ నెల 23న జరగనున్న మాల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా చైర్మన్ లకుమాల మధుబాబు కోరారు. గురువారం నల్లగొండ మాల మహానాడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

చిట్యాల: నల్లగొండలో ఈ నెల 23వ తేదీన నిర్వహించనున్న మాల మహానాడు ఆత్మీయ సమ్మేళనం ప్రచార పోస్టర్‌ను గురువారం చిట్యాల పట్టణంలో ఆ సంఘం నాయకులు విడుదల చేశారు. సంఘం చిట్యాల మండల అధ్యక్షుడు గోలి భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శేపూరి యాదయ్య, గ్రంథాలయ మాజీ చైర్మన్ దాసరి నర్సింహ, శేపూరి మధుసూదన్, లక్ష్మీనర్సు, దాసరి భిక్షం పాల్గొన్నారు.

తిప్పర్తి : నల్లగొండలో ఈ నెల 23న జరగనున్న ఎమ్మార్పీఎస్ ఆత్మీయ సమ్మేళాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా జేఏసీ చైర్మన్ కత్తుల జగన్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన ఎమ్మార్పీఎస్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

టీఎస్ యూటీఎఫ్ అధ్యక్షుడిగా ఏశమల్ల నాగయ్య



చిట్యాల: టీఎస్ యూటీఎఫ్ చిట్యాల మండల నూతన కార్యవర్గాన్ని బొప్పని యాదయ్య అధ్యక్షతన చిట్యాలలో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఏశమల్ల నాగయ్య, ఉపాధ్యక్షులుగా రంగా రామలింగయ్య, ఎం.జానకి, ప్రధాన కార్యదర్శిగా గడగోజు సతీష్, కోశాధికారిగా తోట చంద్రశేఖర్, కార్యదర్శులుగా డి.శ్రీరాములు, ఎన్.శ్రీధర్, బి.రామ్మోహన్, పి.శ్రీనివాసులు, ఆర్.రఘు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సంఘం పగిడిపాటి నర్సింహ, ఎన్నికల పరిశీలకురాలిగాగా బడుగు అరుణ వ్యవహరించారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

శాలిగౌరారం: మండల కేంద్రంలోని 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శుక్రవారం విద్యుత్ మరమ్మతు పనులు చేపట్టనుండడం వల్ల శాలిగౌరారం, ఊట్కూరు, పెర్కకొండారం, గురుజాల, అంబారిపేట, తుడిమిడి, ఆకారం, అడ్లూరు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీధర్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ప్రజలు సహకరించాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక

చండూరు : టీఎస్ యూటీఎఫ్ చండూరు మండల కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాంపల్లి సైదులు, ప్రధాన కార్యదర్శిగా పెండెం గంగాధర్, ఉపాధ్యక్షులుగా బొమ్మరబోయిన సైదులు, కత్తుల మమత, కోశాధికారిగా రావిరాల రమేష్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి హాజరయ్యారు.

నివాస్‌కు డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న నివాస్

రామగిరి(నల్లగొండ): నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన శిల్పకళాకారుడు కొండేటి నివాస్ డాక్టరేట్ అందుకున్నారు. గ్రానైట్ రాతిపై 10 వేలకు పైగా చిత్రాలు వేయడంతో ఫ్రెండ్‌షిప్ మినిస్ట్రీస్ ఎన్జీఓ సంస్థ వారు గౌరవ డాక్టరేట్ ప్రకటించారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో బుధవారం రాత్రి డాక్టరేట్ ప్రదానం చేశారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక చేయూత

చిట్యాల: పట్టణానికి చెందిన సంగిశెట్టి భాస్కర్ (47) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో భాస్కర్ కుటుంబాన్ని ఆదుకునేందుకు అతడితో కలిసి చిట్యాల జెడ్పీహెచ్ఎస్‌లో 1991–92 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ చదువుకున్న స్నేహితులు ముందుకు వచ్చారు. వారంతా కలిసి సేకరించిన రూ.64,500 లను గురువారం భాస్కర్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పోలిశెట్టి రాజు, తోకల జంగారెడ్డి, నక్క విజయసారథి, వెంకటేష్, ముజీబ్, తుక్కాని వెంకట్‌రెడ్డి, గంటిపాక శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

చండూరు : మండల కేంద్రానికి చెందిన పెద్దగాని లచ్చయ్య గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, నామాపురం మాజీ సర్పంచ్ కంచుకట్ల సంపత్ గురువారం పరామర్శించి రూ.10 వేలు అందించారు.

చేనేత కార్మికుడి కుటుంబానికి..

నకిరేకల్ : పట్టణంలోని వీటీ కాలనీలో నివాసం ఉంటున్న చేనేత కార్మికుడు పున్న నర్సయ్య అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం ఆయన మృతదేహన్ని కాంగ్రెస్ నేత దైద రవీందర్ సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. నర్సయ్య దహన సంస్కారాల నిమిత్తం బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

'మహిళా శక్తి'పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఏపీఎం శ్రీదేవి

తిప్పర్తి : ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో నిర్వహించే కార్యక్రమాలపై తిప్పర్తి మండల కేంద్రంలో మహిళా సంఘాల సభ్యులకు ఏపీఎం శ్రీదేవి గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రుణబీమా పథకం, ప్రమాద బీమా పథకాలపై మహిళలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. సీసీ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

టీషర్టుల పంపిణీ


టీషర్టులు పంపిణీ చేస్తున్న హెచ్ఎం భిక్షమయ్య, ఫౌండేషన్ ప్రతినిధులు

కేతేపల్లి: మండలంలోని భీమారం జెడ్పీ పాఠశాలలో 50 మంది విద్యార్థులకు రేఖ ఫౌండేషన్ వారు సమకూర్చిన స్పోర్ట్స్ టీషర్ట్‌లను గురువారం హెచ్ఎం కె.భిక్షమయ్య అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

చండూరు(గట్టుప్పల్) : నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు తీర్చేందుకు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి రూ.57 కోట్లు మంజూరు చేయించారని కాంగ్రెస్ పార్టీ గట్టుప్పల్ మండల అధ్యక్షుడు నామని జగన్నాథం తెలిపారు. గట్టుప్పల్ మండల కేంద్రంలో శిథిలావస్థకు చేరిన స్థంభాలను తొలగించి వాటి స్థానంలో నూతన స్తంభాల బిగింపు కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు.